సాక్షి తిరుపతి

శనివారం । 7 । డిసెంబర్ । 2024



పద్మసరోవరంలో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

టూరిజం జిల్లా అధికారిగా జనార్ధన్‌రెడ్డి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జనార్ధన్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : టూరిజం జిల్లా అధికారిగా జనార్ధన్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇక్కడ పని చేస్తున్న రూపేంద్రనాథ్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో వైఎస్సార్ జిల్లా నుంచి జనార్ధన్ రెడ్డి బదిలీపై వచ్చారు.

మహిళా వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో అతిథులు, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ డ్రగ్ డెవలప్‌మెంట్ అండ్ ట్రాన్సలేషనల్ రీసెర్చ్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజులపాటు కొనసాగనున్న సదస్సుకు వీసీ ఉమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ ఔషధ పరిశోధనను ప్రోత్సహించడం, ప్రపంచవ్యాప్త ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించడానికి కొత్త పరిష్కారాలను అన్వేషించడమే సదస్సు ఉద్దేశమని వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, 6ఎస్ ఫార్మా కంపెనీ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డీఆర్ కృష్ణ, ఎస్ఈఏఆర్ ఫార్మా ఫోరమ్ అధ్యక్షులు టీవీ నారాయణ, ప్రొఫెసర్ జోత్స్నరాణి, ప్రొఫెసర్ విద్యావతి పాల్గొన్నారు.

నేడే 'పేరెంట్-టీచర్స్ మీటింగ్'



సత్యవేడు జెడ్పీ హైస్కూల్‌లో అలంకరించిన తరగతి గది

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్-టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలను ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లాలో మొత్తం 2,322 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 1,741 ప్రాథమిక , 250 ప్రాథమికోన్నత, 331 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పేరెంట్- టీచర్స్ మీటింగ్‌ను పురస్కరించుకుని 1,50,257 మంది విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించడానికి చర్యలు చేపట్టారు.

పులకితం.. పునీతం



స్నపన తిరుమంజనంలో అమ్మవారు

సర్వాలంకారశోభితంగా విలసిల్లే పద్మావతీదేవిని కాంచిన కనులదే కదా భాగ్యము.. మహిమాన్వితమైన పద్మసరోవరంలో పుణ్యస్నానమాచరించిన వారి జన్మము కదా ధన్యము.. పంచమి తీర్థంలో శ్రీమహాలక్ష్మి కరుణాకటాక్ష వీక్షణము పొందిన వారి జీవితము కదా చరితార్థము.. స్నపన తిరుమంజన సేవలో సేదతీరే సిరులతల్లికి భక్తిప్రపత్తులతో ప్రణమిల్లిన వారి గమనమే కదా శుభకరము.. కార్తీక బ్రహ్మోత్సవ వేళ అలమేలు మంగమ్మ దర్శనమే కదా సకల పాప హరణము.. దివ్యతేజస్సుతో అలరారుతున్న శ్రీవారి దేవేరి కృపకు పాత్రులు కావడమే కదా మోక్ష మార్గము.

- వైభవంగా పద్మావతీ అమ్మవారి పంచమి తీర్థం
- పద్మసరోవరానికి పోటెత్తిన భక్త జనం
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన టీటీడీ యంత్రాంగం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవ సంబరం
- నేడు పుష్పయాగానికి సర్వం సిద్ధం



వజ్రాభరణాల అలంకరణలో అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం పద్మసరోవరం(పుష్కరిణి)లో పంచమి తీర్థం(చక్రస్నానం) వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామివారు స్వయంగా తన కుంతాయుధంతో తవ్విన పద్మసరోవరంలో కార్తీక మాసం, శుక్లపక్ష పంచమి తిథి, ఉత్తరాషాడ నక్షత్రం, శుక్రవారం రోజున స్వర్ణకమలంలో శ్రీమహాలక్ష్మీదేవి ఆవిర్భవించినట్లు పురాణ ప్రతీతి. అమ్మవారు ఆవిర్భవించిన పద్మసరోవరంలో ఏటా కార్తీక మాసంలో నిర్వహించే పంచమీతీర్థం రోజున స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగి, కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందని భక్తుల విశ్వాసం.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

పంచమీతీర్థం సందర్భంగా అమ్మవారిని వేకువజామున 3గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. 7గంటలకు వేడుకగా పల్లకి ఉత్సవం నిర్వహించారు. జీయర్‌స్వాముల సమక్షంలో అర్చకులు నేత్రపర్వంగా అమ్మవారు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సమయంలో పుట్టిన రోజు కానుకగా శ్రీవారు పంపించిన ఆభరణాలను అమ్మవారికి అలంకరించారు. అనంతరం 12.15గంటలకు చక్రస్నానం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామల రావు, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, ఎమ్మెల్యే పులివర్తి నాని, సీవీఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, లోకనాథం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం : టీటీడీ ఈఓ

పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. పంచమి తీర్థం సందర్భంగా లక్షలాది భక్తులు పవిత్ర పుష్కరిణిలో స్నానం చేశారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 1000 మంది శ్రీవారి సేవకులు భక్తిప్రపత్తులతో సేవలు అందించారని చెప్పారు. అభినందించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేశారని ప్రశంసించారు.

పుట్టినరోజు కానుకగా వజ్రాభరణాలు

పద్మావతి అమ్మవారికి పుట్టినరోజు కానుకగా తిరుమల శ్రీవారు విశేష వజ్రాభరణాలు పంపించారు. సారెతో పాటు రూ.1.11కోట్ల విలువైన పాండ్యన్ కిరీటం, లక్ష్మీపతకం, డైమండ్ నెక్లెస్, వజ్రాల గాజులు, వజ్రాలు పొదిగిన కమ్మలను అందజేశారు.

నేడు పుష్పయాగం

శ్రీవారి దేవేరికి శనివారం సాయంత్రం 5గంటలకు పుష్పాంజలి చతుర్వేద విన్నపముల(పుష్పయాగం) సేవ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు పుష్పయాగం జరిపించడం ఆనవాయితీ. ఉత్సవ సమయంలో అర్చకులు, అధికారులు, భక్తులు తెలిసీ తెలియక చేసిన తప్పుల కారణంగా వచ్చే దోష పరిహారార్థం పుష్పయాగం జరిపిస్తుంటారు. విశేష కార్యక్రమానికి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు సుమారు నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలు అందజేసినట్లు టీటీడీ ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.




సారె తీసుకువస్తున్న జీయర్ స్వాములు, టీటీడీ అధికారులు

దేవేరికి శ్రీవారి సారె

తిరుమల : పవిత్ర పంచమితీర్థం రోజున పద్మావతి అమ్మవారికి సంప్రదాయం ప్రకారం తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ఈ మేరకు ముందుగా శ్రీవారి ఆలయంలో వేకువనే 2.30 నుంచి పరిమళ ద్రవ్యాలతో విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం శ్రీవారి వక్షస్థలంలో కొలువైన శ్రీమహాలక్ష్మికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. తర్వాత 4.30 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె, విశేష ఆభరణాలను టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు అలిపిరి తీసుకువచ్చి జేఈఓ వీరబ్రహ్మానికి అందజేశారు.



తిరుమంజనం సేవలో సేదతీరుతున్న చక్రత్తాళ్వార్



పద్మావతీదేవి, చక్రత్తాళ్వార్‌కు హారతి సమర్పిస్తున్న అర్చకులు

ధ్వజావరోహణంతో పరిపూర్ణం

అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజావరోహణంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా సాయంత్రం గంగుండ్ర మండపం నుంచి పద్మావతీదేవిని ఊరేగింపుగా ఆలయానికి వేంచేపు చేశారు. రాత్రి 8గంటలకు తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధులలో ఊరేగించారు. రాత్రి 9.30గంటలకు పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు ధ్వజస్తంభంపై ఉన్న గజ చిత్రపటాన్ని అవరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

నిండుకొండ!



పాపవినాశనం డ్యామ్

తిరుమల కొండపై జలాశయాలు నిండుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో కళకళలాడుతున్నాయి. రిజర్వాయర్లకు భారీగా ఇన్‌ఫ్లో ఉండడంతో గేట్లు తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది భక్తుల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని టీటీడీ అధికారులు వెల్లడిస్తున్నారు. తెలుగు గంగ నీటిని కూడా వినయోగించుకుంటే స్థానికులకు కూడా ఇక్కట్లు ఉండవని వివరిస్తున్నారు.

- తిరుమలలోని జలాశయాలకు పోటెత్తిన వరద
- కళకళలాడుతన్న ఐదు డ్యామ్‌లు
- గేట్లు ఎత్తి నీటిని బయటకు వదులుతున్న అధికారులు
- ఇక ఏడాదిపాటు నీటి కష్టాలు తప్పినట్టే

తిరుమల: తిరుమలలోని జలాశయాలు నిండు కుండను తలపిస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లోకి భారీగా వరదనీరు చేరింది. ఇప్పటికే ఐదు డ్యామ్‌లు పూర్తిగా నిండిపోయాయి. గేట్లను ఎత్తి అధికారులు నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటి నిల్వలు తిరుమలలో 270 రోజుల తాగునీటి అవసరాలకు సరిపోతాయని అధికారులు వెల్లడిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జలాశయాల్లో నీటి మట్టం వివరాలు ఇలా ఉన్నాయి.

మూడేళ్ల తర్వాత మళ్లీ..!

దాదాపు మూడేళ్ల తర్వాత తిరుమల్లోని అన్ని జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. తిరుమల నీటి అవసరాల నిమిత్తం టీటీడీ తిరుపతిలోని కళ్యాణిడ్యామ్ నుంచి కూడా నిత్యం 5 లక్షల నుంచి 10లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తోంది. అయితే తిరుమలలోని అన్ని డ్యామ్‌లకు వరద నీరు పోటెత్తడంతో ప్రస్తుతం తాత్కాలికంగా కళ్యాణిడ్యామ్ నీటి సరఫరాను టీటీడీ నిలిపివేసింది.

నిత్యం 35 లక్షల నీరు అవసరం

భక్తులతో పాటు స్థానికుల అవసరార్థ తిరుమలలో నిత్యం 30 లక్షల నుంచి 35 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ప్రస్తుతం ఐదు జలాశాయలు దాదాపుగా నిండిపోవడంతో పాటు తిరుపతిలోని కళ్యాణిడ్యామ్, తెలుగుగంగ నీటిని కూడా టీటీడీ వినియోగించే వెసులుబాటు ఉండడంతో ఏడాది పాటు తిరుమలలో నీటి ఇబ్బందులు తప్పినట్లేనని అధికారులు వివరిస్తున్నారు.



కళకళలాడుతున్న గోగర్భం డ్యామ్

భక్తులకు జల'ధార'

2012 అక్టోబర్‌లో జంట ప్రాజక్టులైన కుమారధార, పసుపుధార ప్రాజెక్టులను పూర్తిచేశారు. ఈ జలాశయాల నీటి సామర్థ్యం 5,492 లక్షల గ్యాలన్లు కాగా ప్రస్తుతం 4,690.74 లక్షల గ్యాలన్లతో కళకళలాడుతున్నాయి.

పాపవినాశనంలో 5,208.00 లక్షల గ్యాలన్లు

1983 ఫిబ్రవరి 2వ తేదీన పాపవినాశనం జలాశయాని టీటీడీ నిర్మించింది. దీని సామర్థ్యం 5,240 లక్షల గ్యాలన్లు కాగా ప్రస్తుతం దాదాపుగా నిండిపోయింది. ఇప్పటికే పాపవినాశనం జలాశయంలోకి 5192.54 లక్షల గ్యాలన్లు నీరు చేరింది. ఇన్ ఫ్లో భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం గేట్లు ఎత్తివేసే అవకాశం ఉంది. ఈ మేరకు ఇప్పటికే వైఎస్సార్ జిల్లా అధికారులను టీటీడీ అప్రమత్తం చేసింది.

గోగర్భం డ్యామ్‌లో 2833.00 లక్షల గ్యాలన్లు

శ్రీవారిని దర్శించుకోవడానికి విచ్చేసే భక్తులతో పాటు తిరుమలలో నివాసముంటున్న స్థానికులు, ఉద్యోగులకు తాగునీటి సమస్య తలెత్తకుండా వారి సౌకర్యార్థం దశలవారీగా టీటీడీ ఇప్పటి వరకు ఐదు జలశాయాలను నిర్మించింది. మొదటగా 1963 అక్టోబర్1న అప్పటి కేంద్ర మంత్రి కె.యల్ రావు గోగర్భం డ్యామ్ ప్రారంభించారు. భూగర్భమట్టానికి 2,894 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ డ్యామ్ నీటి సామర్థ్యం 2,833 లక్షల గ్యాలన్లు. ఇందులో 2,833 లక్షల గ్యాలన్ల వరకు నీటిని భక్తుల అవసరార్థం ఉపయోగించవచ్చు. ప్రస్తుతం ఈ జలాశయం పూర్తిగా నిండిపోయింది. అధికారులు అప్పుడప్పుడు గేట్లను ఎత్తి నీటిని వదిలివేస్తున్నారు.

ఆకాశగంగలో 685.00 లక్షల గ్యాలన్లు

ఆకాశగంగ డ్యాంను 2002 ఏప్రిల్ 27న అందుబాటులోకి వచ్చింది. 633 లక్షల గ్యాలన్ల సామర్థ్యంతో ఉన్న ఈ జలాశయానికి ప్రస్తుతం 645.00 లక్షల గ్యాలన్లు. నీరు చేరింది. డ్యామ్ పూర్తిగా నిండితే.. ఓవర్ ఫ్లో నీరంతా పాపవినాశనం జలాశయంలోకి చేరుతుంది.

ఘన నివాళి




రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాలఅధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ డాక్టర్ శిరీష, ఎస్‌కే.బాబు, కోటూరు ఆంజనేయులు, నల్లానిబాబు, తలారి రాజేంద్ర, దేవానందం పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

ఈఎస్ఐ సేవలపై సంతృప్తి



మాట్లాడుతున్న మంత్రి సుభాష్

తిరుపతి తుడా : ఈఎస్ఐ ఆస్పత్రి సేవలపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి రాయల్‌చెరువు రోడ్డులోని ఈఎస్ఐ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, వాటర్‌ప్లాంట్, ఫిజియోథెరపీ విభాగాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈఎస్ఐ లబ్ధిదారులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని కోరారు. సమన్వయంతో పనిచేసి ఆస్పత్రి అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రికి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వినతి పత్రం సమర్పించారు. దాదాపు 15 ఏళ్లుగా ఆస్పత్రిలో సేవలందిస్తున్నామని, ఖాళీలు భర్తీ చేసే సమయంలో తమకు తొలి ప్రాధాన్యమివ్వాలని కోరారు. అలాగే హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు పెంచాలని విన్నవించారు. సమావేశంలోమెడికల్ సూపరింటెండెంట్ ఎం.శ్యాంబాబు, ఆర్ఎంఓ ఎవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు



క్లుప్తంగా

నీతి అయోగ్ సీఈఓతో కలెక్టర్ భేటీ



నీతి అయోగ్ సీఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్, కమిషనర్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లకు శుక్రవారం విచ్చేసిన నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యంతో కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య భేటీ అయ్యారు. జిల్లావ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు.

కార్యదర్శి పోస్టుల భర్తీకి చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యారమ

రాపూరు : జిల్లాలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీకి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడుతామని జెడ్పీ సీఈఓ విద్యారమ తెలిపారు. శుక్రవారం రాపూరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ రాపూరు మండలంలో రెండు పంచాయతీలకు ఒకే కార్యదర్శి పనిచేస్తున్నారని వెల్లడించారు. సమావేశంలో ఎంపీడీఓ భవానీ పాల్గొన్నారు.

మేత భూముల వివరాలకు వినతి



అర్జీ ఇస్తున్న సర్పంచ్ రత్నమ్మ

సత్యవేడు: చెరివి పంచాయతీలోని చిగురుపాళెం మాదనపాళెం, చెరివి గ్రామాల్లో మేత బీడు భూముల వివరాలు వెల్లడివంచాలని సర్పంచ్ డి. రత్నమ్మ కోరారు. శుక్రవారం చెరివి పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సుబ్రమణ్యానికి వినతిపత్రం అందించారు. మేత బీడు భూమి శ్రీసిటీ ఆధీనంలో ఉందని, స్థానికులు పశువులు కూడా మేపుకోకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చిగురుపాళెంలో ఇళ్లకు డోర్ నెంబర్లు లేవని, హౌస్ ట్యాక్సు కడితే పేరు మాత్రమే రాసి ఇస్తున్నారని గ్రామస్తుడు కె.కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. రసీదు ఇచ్చేలా చర్యలు తీసుకొంటామని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సదస్సుకు పలు సమస్యలపై 23 అర్జీలు అందాయి.

ఖుషీ లేని నిషా!

'తక్కువ ధరకే మద్యం.. అందుబాటులో నాణ్యమైన బ్రాండ్లు.. రూ.100లోపే కిక్కెక్కిస్తాం.. వైన్‌షాపులను ప్రైవేట్‌కు అప్పగించి లాభాల పంట పండిస్తాం'.. అంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక.. మందుబాబులతోపాటు మద్యం దుకాణాల యజమానులకు చుక్కలు చూపిస్తున్నారు. రూ.99కే లిక్కర్ సీసా అని ఆర్భాటంగా ప్రకటించి.. ఎవరికీ అందకుండా చేసేశారు. 20శాతం కమిషన్ అంటూ ఆశపెట్టి.. 'పన్ను' పోటుతో వైన్‌షాపు నిర్వాహకులకు నిషా దించేశారు. దీంతో నష్టాలను భర్తీ చేసుకునేందుకు అనధికారికంగా మినిబార్లు ఏర్పాటు చేసుకునే పరిస్థితి తీసుకువచ్చారు.



తిరుపతి క్రైమ్ :మందుబాబులకు చీప్ లిక్కర్‌ను అతి తక్కువ ధరకే అందిస్తామని కూటమి ప్రభుత్వం నూతన పాలసీని తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే రూ.99 లిక్కర్‌ను పరిచయం చేసింది. అనంతరం వాటి అమ్మకాలపై పరిమితి విధించింది. మందు బాబులకు మద్యం దుకాణం వరకు రప్పించడం, అక్కడ కావాల్సిన బ్రాండు లేకుండా చేసి.. తప్పనిసరిగా దాని కంటే అధిక ధర ఉండే లిక్కర్ కొనిపించేలా పన్నాగం పన్నింది. ఇందులో కూటమి సర్కారు సఫలమైందనే చెప్పాలి. లేకుంటే జిల్లాలో 45 రోజుల్లో రూ. 412.22 కోట్ల మద్యం విక్రయం సాధ్యం కాదు. జిల్లా వ్యాప్తంగా 227 వైన్‌షాపులుంటే రోజుకు ఒక్కో దుకాణానికి సగటున 4 బాక్సుల రూ.99 మద్యాన్ని మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఇతర బ్రాండ్ల లిక్కర్ ఒక్కో దుకాణంలో 62 బాక్సులు అమ్ముడవుతుంటే, రూ.99 మద్యం మాత్రం రెండు బాక్సులకే పరిమితం చేస్తున్నారు. ఇందులోనూ కొన్ని దుకాణాల్లో రూ.99 లిక్కర్‌ను బెల్టు దుకాణాలకు ఇచ్చేసి, స్టాకు అయిపోయిందని చేతులెత్తేస్తున్నారు. బెల్టు దుకాణాల్లో ఒక్కో బాటిల్‌కు రూ.10 అధికంగా వసూలు చేస్తున్నారు.

బార్‌లా రూమ్!

జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు వద్ద బార్లను తలతన్నేలా అనధికారిక రూములు కనిపిస్తున్నాయి. మద్యం దుకాణం కోసం లైసెన్సు తీసుకున్న వ్యాపారులు, పక్కనే మినీబార్‌ను తలపించేలా పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకున్నారు. దీనికి సమీపంలోనే వరసగా 3, 4 దుకాణాలు మద్యం తాగడానికి వెలుస్తున్నాయి. ఇదేమిటని లైసెన్‌దారుడిని అడిగితే.. ప్రభుత్వం తమను నట్టేట ముంచిందని చెబుతున్నారు. పాలసీ ప్రకటనకు ముందు మద్యం వ్యాపారంలో 20 శాతం లాభాలు అని చెప్పి, తీరా దుకాణం పెట్టాక కళ్లు బైర్లు కమ్ముతున్నాయని వాపోతున్నారు. అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ టాక్స్ పేరిట డిస్టిలరీ నుంచి డిపోకు అందుతున్న మద్యంపై అధిక శాతం పన్నులు వేస్తున్నారని వాపోతున్నారు. అలాగే వివిధ రకాల పన్నులతో బాదేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ.2 లక్షల చొప్పున లైసెన్సు రుసుము, దుకాణాల అద్దె, కరెంటు బిల్లు, పనిచేసే వాళ్ల జీతభత్యాలు అన్నీ కలుపుకుంటే లాభం రాకపోగా, నష్టాలు వస్తున్నాయని చెబుతున్నారు. రోజుకు కనీసం రూ.2 లక్షల వ్యాపారం జరిగితే కానీ, నష్టాల నుంచి బయటపడలేమని వెల్లడిస్తున్నారు. జిల్లాలో కేవలం 20 శాతం దుకాణాల్లో మాత్రమే రోజుకు రూ.2 లక్షల వ్యాపారం జరుగుతోందని వివరిస్తున్నారు. నష్టాలను అధిగమించడానికి దుకాణం పక్కనే పర్మిట్ గదులు పెట్టుకుంటే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు.

సరిహద్దుల నుంచి ప్రవాహం

జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి భారీగా కర్ణాటక మద్యం జిల్లాలోకి ప్రవహిస్తోంది. రూ.99 మద్యం దొరక్కపోవడంతో మందు బాబులు కర్ణాటక లిక్కర్‌కు అలవాటు పడుతున్నారు. అక్కడ క్వార్టర్ చీప్ లిక్కర్ రూ.70కే లభిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయాలు సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది.

మామూళ్ల మత్తులో..!

డిస్టిలరీలతో ప్రభుత్వం కుమ్మక్కై రూ. 99 చీప్ లిక్కర్‌ను అందుబాటులోకి రాకుండా చేస్తోందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అనధికారికంగా నడుస్తున్న మినీ బార్లను తొలగించడంలో అధికారులు సైతం మౌనం వహిస్తున్నారు. కళ్లెదుటే బెల్టు దుకాణాల్లో విచ్చలవిడి అమ్మకాలు జరుగుతున్నా నోరు మెదపడం లేదనే విమర్శలున్నాయి. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 లక్షల జరిమానా విధించాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినా ఒక్కచోట కూడా అమలు కావడం లేదు. కొన్నిచోట్ల మద్యం దుకాణాల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటుపడి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. అందుకే లైసెన్సుదారులకు కొందరు అధికారులు కొమ్ముకాస్తూ, బార్ నిర్వాహకుల ఇబ్బందులు పట్టించుకోవడంలేదని తెలుస్తోంది.

హోంగార్డులు.. నిస్వార్థ సేవకులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

తిరుపతి క్రైం : పోలీస్‌శాఖలో హోంగార్డులు నిస్వార్థ సేవకులని అదనపు ఎస్పీ శ్రీనివాసరావు కొనియాడారు. శుక్రవారం తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పని భారం అధికంగా ఉంటుందని, ట్రాఫిక్ డ్యూటీలు, వీవీఐపీ బందోబస్తులు, బ్రహ్మోత్సవాలు ఇలా పలు రకాల విధులు నిర్వర్తించాల్సి వస్తుందని వెల్లడించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత కారణంగా హోంగార్డులతో ఎక్కువ పని చేయించాల్సి వస్తోందని వివరించారు. ఒడిదుడుకులు ఎదురైనా రాజీ పడకుండా విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ క్రమంలో తమ సంక్షేమానికి సహకరిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడికి హోంగార్డులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిరంజీవి, పోతురాజు పాల్గొన్నారు.

కబ్జా నుంచి కాలువకు విముక్తి

- సమష్టిగా గ్రామస్తుల కృషి
- పనులను అడ్డుకున్న టీడీపీ నేత



కాలువ తీయిస్తున్న ఇరిగేషన్ అధికారులు, గ్రామస్తులు

తిరుపతి రూరల్ : గ్రామస్తులు చేయి చేయి కలిపారు. చెరువులోకి స్వర్ణమ్మను రప్పించేందుకు భగీరథ ప్రయత్నం ప్రారంభించారు. ఆక్రమించుకున్న వారు అడ్డుకున్నా వెరవలేదు. రెవెన్యూ రికార్డులను బయటకు తీసి కాలువకు ప్రాణం పోశారు. అధికారులను రప్పించి, హద్దులను నిర్ధారించి, కాలువను పునరుద్ధరిస్తున్నారు. చెరువులోకి నీటిని తీసుకువచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న యువకులపై ప్రశంసల జల్లు కురుస్తోంది. వివరాల్లోకి వెళ్లితే....తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ పంచాయతీలో దాదాపు 70 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. నీరు లేక ఇది ఎప్పుడూ ఎండిపోయే ఉంటుంది. పక్కనే ఉన్న పేరూరు చెరువు మాత్రం స్వర్ణముఖి నది ప్రవహిస్తే చాలు చెరువులోకి నీరు చేరేది.. స్వర్ణముఖి నది నుంచి పేరూరు చెరువుకు వచ్చే కాలువకు లింకు కాలువ పాతకాల్వ చెరువుకు సైతం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. కాలువను దశాబ్దాల క్రితమే పూడ్చివేసి పక్కన ఉన్న రైతులు ఆక్రమించుకున్నారు. దీంతో గత నాలుగు రోజులుగా పాతకాల్వ, పేరూరు, సీమల్లవరం, పేరూరు సర్వేయర్లు కాలువను సర్వే చేశారు. ఆక్రమణలు గుర్తించి, హద్దులు వేశారు. కొందరు రైతులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే రూరల్ తహసీల్దార్ రామాంజనేయులునాయక్ పోలీసుల రక్షణతో సర్వే పూర్తి చేయించారు. 300 మీటర్ల మేర కాలువను గుర్తించారు.

టీడీపీ నేత దౌర్జన్యం

సర్వే పూర్తి కావడంతో పాతకాల్వ గ్రామస్తులు సొంతనిధులతో ఇరిగేషన్ అధికారులతో కలిసి శుక్రవారం స్వర్ణముఖి నది నుంచి లింక్ కాలువను తీసేందుకు జేసీబీతో పనులు ప్రారంభించారు. అయితే సీమల్లవరం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు మనోహర్‌నాయుడు, అనుచరులతో వచ్చి పనులను అడ్డుకున్నారు. కాలువను తీయడానికి వీలులేదని హుకుం జారీ చేశారు. దీంతో పాతకాల్వ వాసులు తిరగబడ్డారు. గ్రామానికి ఉపయోగపడే కాలువ నిర్మాణానికి ఎందుకు అడ్డుపడుతున్నావని నిలదీశారు. దీంతో ఆయన వెళ్లిపోయారు. రెండు రోజుల్లో కాలువ నిర్మాణం పూర్తి చేసి, చెరువుకు స్వర్ణముఖి నది నీళ్లను తీసుకువస్తామని రూరల్ ఇరిగేషన్ ఏఈ రవి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో పాతకాల్వ గ్రామస్తులు శివారెడ్డి, ప్రభురెడ్డి, విజయకుమార్, రోశిరెడ్డి, రవిబాబు పాల్గొన్నారు.

జిల్లాకు 'జ్వరం'!

- పెరుగుతున్న డెంగీ, చికున్‌గున్యా కేసులు
- జ్వర బాధితులతో కిక్కిరిసిన ఆస్పత్రులు

తిరుపతి తుడా : జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పెద్దసంఖ్యలో జనం విష జ్వరాల బారిన పడుతున్నారు.ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో నిండిపోయాయి. డెంగీ కేసులు అధికంగా నమోదవుతుండడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. డీఎంహెచ్ఓ శ్రీహరి ఎప్పటికప్పుడు వైద్యాధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేస్తున్నారు.

పదుల సంఖ్యలో..

జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి గడిచిన5 నెలల్లో సరాసరి అధికంగా 20 నుంచి 40 మంది డెంగీ బారిన పడుతున్నారు. అలాగే చికున్‌గున్యా రోగులు సైతం పెరుగుతున్నారు. టైఫాయిడ్ తదితర వైరల్ ఫీవర్లు వందల సంఖ్యలో నమోదవుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు రోజుకు 100 వరకు ఓపీలు వస్తుండగా, అర్బన్ హెల్త్ సెంటర్లో 150 వరకు, శ్రీకాళహస్తి, గూడూరు వంటి ఏరియా ఆస్పత్రుల్లో 250కి పైగా, జిల్లా ఆస్పత్రిలో సుమారు 320 మందికి వరకు జ్వర పీడితులు ఓపీ సేవలు పొందుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధులు సోకే సమయం ఇది. వర్షాలతో వాతావరణ మార్పుల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే దోమల కారణంగా డెంగీ, చికున్ గున్యా బారిన పడుతున్నారు. ఈ సీజన్‌లో అప్రమత్తం చాలా అవసరం. ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలి. విష జ్వరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

– శ్రీహరి, డీఎంహెచ్ఓ

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

PLOTS FOR SALE

■ పూర్తిగా ఉచితి... ఉచితం. పుత్తూరు కళ్యాణపురం, వినాయకపురం రోడ్ 2400Sq 15 లక్షలు పెట్టి ఒక Plot కొంటే 1800 Sq Plot పూర్తిగా ఉచితం. ఒకే ఒక Plot మాత్రం ఉంది. త్వరపడండి. సంప్రదించండి సెల్: 9944197991, 9042290608.

Wanted

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు Office Asst., Worker, TeleCaller, PRO, Marketing Staff కావలెను.అర్హత:10thఆపైన, ఆకర్షణీయమైనజీతం. 6309753339, 9550270326.

■ తిరుపతిలో వివిధ బ్రాంచీలు గల హోటల్ (లాడ్జి) నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్ -4 కావలెను. మంచి జీతం. సంప్ర ✆ 8801880415

■ Collection Executives in Chittoor, Madanapalli, Piler, Srikalahasthi, Tirupati. Q:Inter, Degree, Good Salary+ Incentives.9347357251, 7842861911.

■ తిరుపతి, గాజులమండ్యం పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, లేబర్ కావలెను. భోజనము, వసతి కలదు. సంప్రదించండి: 9100518607, 9515488473.

■ తిరుపతిలో ప్రముఖLife InsuranceCompany కొరకు Retired, VRS & Senior Citizens కావలెను. ఆకర్షిక ఆదాయం & Managers కావలెను. Q: Any Degree, Exp:2yrs, M/F, A: upto 40yrs,S:4L-9L P/A+Incentives. 9505850438.

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9019041491

■ నెల్లూరు కేంద్రంగా ఉన్న పేరొందిన కంపెనీకి LMV లైసెన్స్ గల కార్ డ్రైవర్ కావలెను. ప్రఖ్యాత కంపెనీలు, ట్రావెల్ ఏజెన్సీలలో అత్యాధునిక విలాసవంతమైన కార్ల డ్రైవింగ్‌లో అనుభవం గడించి ఉండవలెను. ఆకర్షణీయమైన జీతం, PF, ESI, బోనస్, వసతి కల్పించబడును. ఆసక్తి గల అభ్యర్థులు సంప్ర : 6300531030

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901

■ కస్టర్‌ట్రస్ట్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640400073, 9160900024

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం :రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని ఎస్పీ సుబ్బరాయుడు కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన మహనీయుడు అంబేడ్కర్ అని వెల్లడించారు. అలాగే తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .కార్యక్రమంలో మల్లారపు రవి ప్రసాద్, గుండాల గోపీనాథ్ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, కట్టుమంచి చంద్రబాబు యాదవ్, దుగ్గాణి జయరామ్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, దీపక్ యాదవ్, చెన్నూరు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం



నూతన భవనం ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరిరూరల్ : రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళుర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అర్‌అండ్‌బీ. పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లలో గుంతలను పూడ్చివేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ క్రమంలోనే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు సకాలంలో నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. నేతలు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో రెండు పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, జెడ్పీ సీఈఓ విద్యారమ, వైస్ చైర్మన్ లక్ష్మీప్రసన్న, ఎంపీపీ తంబిరెడ్డి తనుజాశివారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ ఎంపీపీ సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ పులుకొల్లు రాజేశ్వరరావు, స్థానిక నేత శివారెడ్డి, ఎంపీడీఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన వెంకటేశ్వర్లు

వాకాడు : మండలంలోని చిన్నతోటలో శుక్రవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. వెంకటేశ్వర్లు, శాంతి దంపతులు చిన్నతోటలో నివసిస్తున్నారు. వంట విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న వెంకటేశ్వర్లు ఆగ్రహం పట్టలేక పురుగుల మందు తాగేశాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

దళితుడిపై దాడి హేయం

- వైఎస్సార్‌సీపీ నేత సెంథిల్‌కుమార్‌కు చెవిరెడ్డి పరామర్శ



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న చెవిరెడ్డి

పాకాల : దళితుడిపై టీడీపీ గూండాలు దాడి చేయడం హేయమని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మండిపడ్డారు. పచ్చమూక దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత సెంథిల్‌కుమార్‌ను శుక్రవారం పాకాలలో చెవిరెడ్డి పరామర్శించారు. కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సెంథిల్‌కుమార్‌కు మెరుగైన వైద్యం చేయిస్తామని, వారికి అండగా ఉంటామని బరోసా కల్పించారు. నిందితులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసులు కేసు నమోదు చేయకుంటే, అధికారులు, టీడీపీ గూండాలపై ప్రైవేట్ కేసు పెట్టించేందుకు వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో దాడి జరిగిన తీరును చెవిరెడ్డికి బాధితుడి భార్య వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ పట్టణంలోని రామకృష్ణా డీలక్స్ థియేటర్ టీడీపీ గూండాలకు అడ్డాగా మారిందన్నారు. సెంథిల్‌కుమార్‌పై పోలీసులకు ముందస్తుగా తెలిసే దాడి జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సినిమా థియేటర్ యాజమాన్యంపై కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సెంథిల్‌కుమార్ భార్య, పిల్లలు కాళ్లు పట్టుకుని వేడుకున్నా పచ్చమూక కనికరించలేదని వాపోయారు. పోలీసులు సైతం బాధితులనే బెదిరిస్తున్నారని, టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయకుంటే ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 46,957 మంది స్వామివారిని దర్శించుకోగా 21,560 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పరిశ్రమల్లో పటిష్ట భద్రత తప్పనిసరి



మాట్లాడుతున్న మంత్రి వాసం శెట్టి సుభాస్

తిరుపతి అర్బన్ : కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి వాసం శెట్టి సుభాస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పరిశ్రమల యజమానులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఫ్యాక్టరీల నిర్వాహకులు తొలి ప్రాధాన్యతను కార్మికులకే ఇవ్వాలని చెప్పారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. కమిటీని ఏర్పాటు చేసుకుని కార్మికులకు అండగా ఉండాలని సూచించారు. స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించారు.

తుస్సుమన్న రెవెన్యూ సదస్సు!



కచ్చపి ఆడిటోరియం వేదికపై రెవెన్యూ అధికారులు, టీడీపీ నేతలు

–తొలి రోజు వచ్చింది 10 అర్జీలే!

తిరుపతి అర్బన్: తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు తుస్సుమంది. కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో ×భూమి లాక్కున్నారు¤ అనే అంశంపై 1, మంగళంలో 22–ఏ సంబంధించి 6, ఓటీఎస్ రిజిస్ట్రేషన్ 1, ఓబీసీ సర్టిఫికెట్ 1, ప్రభుత్వ భూమికి భద్రత కల్పించండి 1 చొప్పున మొత్తం 10 అర్జీలు మాత్రమే అందాయి. సదస్సులపై సరైన ప్రచారం లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీనిపై రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా, ప్రశ్నించారు. తిరుపతిలో పెద్దగా సమస్యలు లేవని సమాధానమివ్వడం గమనార్హం. అర్జీలు పెద్దగా రాకపోవడంతో చేసేదేమీ లేక తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తమ కార్యాలయంలో విధులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వచ్చింది. పలువురు బీఎల్‌ఓలు ఓటర్ల సర్వేకు సంబంధించి తహసీల్దార్ వద్ద సంతకాలకు వచ్చారు. ఇక, సదస్సులో అధికారుల కన్నా టీడీపీ నేతలే ఎక్కువగా కనిపించారు.

ప్రొఫెసర్‌పై దాడి దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేయడం దారుణమని, ఘాతుకానికి పాల్పడిన భజరంగ్‌దళ్ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేయాలని అఖిలపక్ష ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, అంబేడ్కర్ భవన్ చైర్మన్ పి.పరమశివం, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, అంబేడ్కర్ అకాడమీ చైర్మన్ ధన శేఖర్, టీటీడీ ఉద్యోగ సంఘాల నేత ప్రసాద్‌రావు,ఎస్వీయూ విద్యార్థి సంఘ నేత సదా పాల్గొని ప్రసంగించారు. ప్రొఫెసర్‌పై దాడి జరిగి నాలుగు రోజులవుతున్నా నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు విఫలమయ్యారని మండిపడ్డారు. వర్సిటీ అధికారులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. బయట వ్యక్తులు యూనివర్సిటీలోకి అక్రమంగా ప్రవేశించడం నేరమని వెల్లడించారు. దీనిపై వర్సిటీ అధికారులతో సోమవారం భేటీ కానున్నట్లు తెలిపారు. సమావేశంలో టీటీడీ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు మహేష్, సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.రవి, అశోక్ పాల్గొన్నారు.